క్లుప్తంగా

జాతీయ రహదారిపై మరమ్మతు పనులు



వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామం వద్ద కోతకు గురైన 63 నంబరు జాతీయ రహదారికి ఆర్అండ్బీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిపై ఉన్న కల్వర్టు దెబ్బతిని రోడ్డుపై పగుళ్లు వచ్చాయి. జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు వెళ్తున్నందున ఇబ్బందులు లేకుండా మరమ్మతు పనులు చేస్తున్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

రుద్రూర్: మండల కేంద్రమైన రుద్రూర్లో విఠలేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ, జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిదుల వీరేశం, గెంటీల సాయిలు తెలిపారు. అధిక శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రేమ వివాహం చేసిన గ్రామ పెద్దలు

వర్ని (చందూర్): చందూరు మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రేమ వివాహం జరిపించారు. లక్ష్మాపూర్కు చెందిన ఇమ్రాన్, చందూర్కు చెందిన నేహాబేగం గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలిసి సర్పంచ్ సత్యనారాయణ వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆదివారం పెళ్లి చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లింగేశం, సాయిలు, గంగాధర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నందిపేట్: మండలంలోని వెల్మల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆదివారం బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్, ఉప సర్పంచు ముప్పెడ నారాయణ, బీఆర్ గంగాదర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు సహకరించండి



ఆర్మూర్టౌన్: పట్టణంలో శాంతి భద్రతలకు సహకరించాలని ఎస్సై అశోక్ కోరారు. పట్టణ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన్ను బీఆర్ఎస్ నాయకులు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్హెచ్వో సురేష్ బాబు, బీఆర్ఎస్ నాయకులు ఎండీ సలీం, దామోదర్గౌడ్, రాము, చొక్కరావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్టౌన్: ఆర్మూర్లోని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు, పొలిటికల్ సైన్స్ బోధించేందుకు అర్హులైనవారు మంగళవారం నిర్వహించనున్న రాతపరీక్ష, డెమోకు హాజరు కావాలని సూచించారు. పీజీలో 55 శాతంపైగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం



బోధన్: తెలంగాణ విద్యార్థి పరిషత్ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించి అనంతరం పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్, శశిధర్ జెండా ఆవిష్కరించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.

రైతులకు ఆర్థిక భారం

- మహిళలకు కూలి రూ.500, పురుషులకు రూ.700
- ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్



ఆర్మూర్ శివారులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఆర్మూర్: రైతులకు కూలీల భారం అధికమవుతోంది. వరి నాట్లు వేసేందుకు మహిళలకు రూ.500, పురుషులకు రూ.700 ప్రకారం రోజుకు కూలి చెల్లించాల్సిన పరిస్థితి. కల్లు, ఆటోలకు అదనంగా మరికొంత డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కూలీ రేట్లు ఇష్టానుసారంగా పెంచేయడంతో తప్పని పరిస్థితుల్లో వారు అడిగిన మొత్తాన్ని చెల్లిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా రావడంతో వరి పంటను పండించడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మంది రైతులు వరి పంటను సాగు చేస్తుండటంతో కూలీలు తమ కూలీ రేట్లను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. చేసేది ఏమీలేక వారి అడిగినంత మొత్తాన్ని చెల్లించి నాట్లు వేయిస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో నాట్లు వేయాలంటే రైతుకు ఇద్దరు పురుషులు, ఏడుగురు మహిళా కూలీలు అవసరం ఉంటుంది. నాట్ల సమయంలోనే ఇలా ఉంటే పంట చేతికి వచ్చే సరికి రెండు సార్లు కలుపు తీయించాల్సి ఉంటుంది. మందులు చల్లేందుకు అదనపు ఖర్చులు వస్తుండటంతో పెట్టిబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఠాగా ఏర్పడిన కూలీలు..

ముఠాగా ఏర్పడిన మహిళా కూలీలను తమ డిమాండ్ను బట్టి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఎక్కువ కూలి డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి రావడం లేదు



కూలీలు, దుక్కి దున్నేందుకే డబ్బులు ఎక్కువ ఖర్చు అవుతోంది. దీంతో పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర పెంచాలి. – చిన్నయ్య, రైతు, శ్రీరాంపూర్

సాగు కష్టమే



కూలి రేట్లు అధికంగా పెరిగిన కారణంగా భవిష్యత్తులో సాగు చేయడం కష్టమే. కూలీల కొరతను అధిగమించాలంటే వ్యవయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలి. – పెద్దకాపు రాజు, రైతు, పెర్కిట్

రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ రోటరి క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక పెర్కిట్లో నిర్వహించిన కార్యక్రమానికి మార్క్ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, రోటరీ నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్ రావు, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ ఎన్వీ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్మూర్ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పట్వారి గోపికృష్ణ, పట్వారి తులసి కుమార్, కోశాధికారిగా లక్ష్మీ నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నీట్ మెడిసిన్ విభాగంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిని, క్రీడా పోటీల్లో రాణిస్తున్న వారిని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు చంద్రసేన్ రెడ్డి, కాంతి గంగా రెడ్డి, పద్మ మురళి, బండారి ప్రసాద్, చరణ్ రెడ్డి, పుష్పాకర్ రావు, విజయసారథి పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



ఆర్మూర్టౌన్: ఆర్మూర్ హౌసింగ్బోర్డు కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం స్థానికులు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. ఆలయ ఆవరణాన్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో చెన్నశంకర్, జిట్టమారుతి, నరేష్, విఠల్, జగదీష్, గణేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



బోధన్లో ట్యాంక్ వద్ద బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

బోధన్ టౌన్: బోధన్ పట్టణంలోని బల్దియా అధికారులు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలు, 10 నిమిషాల కార్యక్రమాన్ని పలు వార్డుల్లో నిర్వహించారు. సందర్భంగా వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. వాటర్ ట్యాంకులు, డ్రైనేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఇళ్ల వద్ద నీటి తొట్టెలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగింపచేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం కొనసాగుతున్న దీక్షలు



రెంజల్: బండల్ల రోడ్డు పనులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద 33 రోజులుగా రైతులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా ఆదివారం దేవాలయ కమిటి ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సతీష్, క్రాంతి, రంజిత్, దినేష్, లక్ష్మణ్గౌడ్, రాజేశ్వర్, భూమన్న, భాను. నరేందర్, శివకుమార్, అనిల్, రవీందర్, శీలం రాజు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల కోసం ఆర్థిక సహాయం



మదర్సాలో సరుకుల కోసం ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్: వర్షాలకు మండల కేంద్రమైన వేల్పూర్లో ఉన్న మదర్సాలో ఉన్న నిత్యావసర వస్తువులు తడిసిపోవడంతో వాటిని కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ నాయకుడు సునీల్రెడ్డి వితరణ చేసిన రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షుడు రఫీ, నాయకులు మల్లేష్, దామోదర్గౌడ్, మజీద్, వినోద్, రమణ, రేవంత్, రహీం, మోహన్, జంగన్న పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

కమ్మర్పల్లి: మండలంలోని హాసకొత్తూర్లో వర్షానికి ఇల్లు కూలిపోయి నిరాశ్రయురాలైన జంబారాత్ సుమ, ఎర్గట్ల మండలంలోని దోంచందలో ఆటో ప్రమాదానికి గురైన లక్ష్మికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎర్గట్ల, కమ్మర్పల్లి మండలాల అధ్యక్షులు దేవారెడ్డి, సుంకేట రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో మున్నూరు కాపు ఒకటో పంత సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో ఆ సంఘం నాయకులు ఆదివారం సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజేందర్, చిట్టి, సాయన్న, అనిల్కుమార్, మోహన్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలేక రైతులకు నష్టం



పొలాల్లో ఇసుక దిబ్బలను పరిశీలిస్తున్న మోహన్రెడ్డి

ఎడపల్లి(బోధన్): ప్రణాళిక లేకపోవడం వల్లే అలీసాగర్ ఆయకట్టు కింద రైతులు ప్రతి ఏటా వరద నీటితో తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ నాయకుడు వడ్డి మోహన్రెడ్డి అన్నారు. అలీసాగర్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో మండలంలోని ఠాణాకలాన్ శివారులోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. పొలాలను పరిశీలించిన ఆయన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు కిరణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు



బషీరాబాద్, దోన్పాల్ గ్రామాలకు వెళ్లే రోడ్డు

కమ్మర్పల్లి: మండలం బషీరాబాద్, దోన్పాల్ గ్రామాల మధ్యగల రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బీటీ రోడ్డు పలు చోట్ల ధ్వంసమైంది. దీంతో వాహన రాకపోకలు బంద్ అయ్యాయి. బషీరాబాద్ గ్రామస్తులు దోన్పాల్ వెళ్లాలంటే వడ్యాట్ వెళ్లి దోన్పాల్ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంజాయిని నిర్మూలించాలి



బాల్కొండ: గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ అన్నారు. ఆదివారం ముప్కాల్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ కొనసాగించాలన్నారు. ఆయన వెంట ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంత్రి నిర్లక్ష్యానికి రైతులు బలి



పొలాలను పరిశీలిస్తున్న మానాల మోహన్రెడ్డి

కమ్మర్పల్లి : మంత్రి వేముల ప్రశాంత్రెడ్డి సరైన ప్రణాళిక లేకుండా చేపట్టిన పనుల కారణంగా రైతులు నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్రెడ్డి విమర్శించారు. కమీషన్ల కోసం నిర్మించిన చెక్డ్యాంల వల్ల పంట మునిగాయని, కమీషన్ల కోసం మరమ్మతులు చేసిన చెరువులు కొట్టుకుపోవడం మంత్రి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆదివారం కమ్మర్పల్లి మండలం చౌట్పల్లిలోని ఈదుల్లకుంట చెరువు, రాథోడ్ వాగు ప్రాజెక్ట్, అమీర్నగర్ శివారులోని గట్టు పొడిచిన వాగు కాలువను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, చౌట్పల్లి ఈదుల్లకుంట చెరువు కట్ట మరమ్మత్తులు చేసిన 15 రోజులకే మట్టి కొట్టుకుపోయి లీకయిందని, వరద ఎక్కువైతే కట్ట తెగిపోయేదన్నారు. ఊర చెరువు నుంచి రాథోడ్ చెరువులోకి నీటిని మళ్లించడం వల్ల పొలాలు కొట్టుకుపోయాయన్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి అని సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమీన్నగర్లోని గట్టుపొడిచిన వాగు వద్ద ఫీడర్ ఛానల్ పనులు అసంపూర్తిగా చేయడంతో పొలాలు కోతకు గురవుతున్నాయన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు పడిగల ప్రవీణ్, భువనగిరి భాస్కర్, అల్లకొండ రాజేష్, నూకల బుచ్చిమల్లయ్య,సుంకట శ్రీనివాస్, గోపిడి లింగారెడ్డి తదితరులున్నారు.

అలీసాగర్ దిగువన చేపలు పడుతున్న స్థానికులు



చేపల కోసం వేట



ఎడపల్లి(బోధన్): అలీసాగర్ గెట్లను దించడంతో లోతట్టు ప్రాంతాల్లో చేపలు పట్టేందుకు స్థానికులు పోటీ పడ్డారు. కొందరికి 8 నుంచి 10 కిలోల బరువున్న చేపలు దొరికాయి.

చెక్డ్యాం డిజైన్లతో తీవ్రనష్టం



వేల్పూర్లో మాట్లాడుతున్న డీకే అరుణ



పెర్కిట్లో డీకే అరుణతో బీజేపీ నేతలు

వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గంలో వాగులపై నిర్మించిన చెక్డ్యాముల డిజైన్ లోపంతో రైతులకు తీవ్ర నష్టం కలుగుతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. ఆదివారం ఆమె వేల్పూర్ మండల కేంద్రంతో పాటు, మోతె గ్రామాల్లో వరదతో నష్టపోయిన పంటలను ఆమె పరిశీలించారు. మోతెలో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.చెక్డ్యాంకు ఒక ఏడాది ఇటువైపు, మరో ఏడాది అటువైపు పంటలు కొట్టుకుపోతున్నాయని, రైతులకు పెట్టుబడి, శ్రమ బూడిదలో పోసినట్లవుతుందన్నారు. పంటలు కోల్పోయిన మోతె రైతులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి కనీస భరోసా ఇవ్వలేదన్నారు. చెక్డ్యాములన్నీ ఇక్కడున్న బీఆర్ఎస్ నేతల జేబులు నింపుకోవడానికే నిర్మించారన్నారు. సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న మోతె గ్రామాన్ని సీఎం సందర్శించాలని మోతెలో ఆయన ముడుపుతో గ్రామాన్ని వరదతో ముంచారన్నారు. ఆయన దత్తత తీసుకున్న మోతెలో ఒక్క డబుల్ ఇల్లు కట్టలేదన్నారు. మిషన్ కాకతీయ ద్వారా నాసిరకంగా చెరువులకు కట్టలు కట్టడంతో తెగిపోయాయన్నారు. వరద బాధితులకు ఒక్కొక్కరికి రూ. 50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, పల్లెగంగారెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, పైడి రాకేశ్ రెడ్డి, పెద్దోల్ల గంగారెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, వేల్పూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఏలేటి రమేశ్ తదితరులున్నారు.

డీకే అరుణకు ఘన స్వాగతం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ వద్ద ఆదివారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్ర వరద ప్రభావానికి గురైన వేల్పూర్ మండలం మోతె గ్రామాన్ని సందర్శించేందుకు వెళ్తున్న ఆమెను నాయకులు కలిశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య, రాష్ట్ర నాయకులు పల్లె గంగా రెడ్డి, ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పాలెపు రాజు, నూతుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురి రక్తదానం



వర్ని(మోస్రా): మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 24 మంది రక్తదానం చేశారు. నరసయ్య బసవేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు

వృద్ధాశ్రమంలో అన్నదానం

బాల్కొండ: మండలం కిసాన్నగర్లోని వృద్ధాశ్రమంలో ఆదివారం లయన్స్ గవర్నర్ బాబురావు జన్మదిన వేడుకల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వన్నెల్(బి)లో వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలను ఉచితంగా చేశారు. సభ్యులు పెండెం జీవన్, లింగం పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబురావు జన్మదినం సందర్భంగా మామిడిపల్లిలో ఆర్మూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గుజరాతి ప్రకాష్, రాజేష్, కోశాధికారి కుంటాల నరేందర్, మాజీ అధ్యక్షుడు చేపూర్ గణేష్, జోనల్ చైర్మన్ డీకే రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

బోధన్రూరల్/రుద్రూర్/కోటగిరి/మోర్తాడ్/వర్ని: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సమ్మెను విరమించే ప్రసక్తే లేదని పంచాయతీ కార్మికులు వెల్లడించారు. వివిధ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వారు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 25వ రోజుకు చేరింది. డిమాండ్ల కోసం సోమవారం చేపట్టనున్న చలో కలెక్టర్ కార్యక్రమానికి రావాలని కోరారు. రుద్రూర్లో కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస రావు, కోటగిరిలో పీసీసీ డెలిగేట్స్ శ్రీనివాస్ రావ్, రాజారెడ్డి, గంగాప్రసాద్, వర్నిలో టీడీపీ కార్యదర్శి విఠల్ కార్మికులకు మద్దుతు తెలిపారు.

బకాయి వేతనాల కోసం దీక్షలు



బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) లే ఆఫ్ నాటి నుంచి చెల్లించాల్సిన 93 నెలల బకాయి వేతనాల కోసం ఆగస్టు 5 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని కార్మికులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఆదివారం స్థానిక ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట కార్మికులు సమావేశమై నిరసన తెలిపారు. మూతపడిన ఫ్యాక్టరీని తెరిపించాలని, బకాయి వేతనాలన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 5 నుంచి చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలకు కార్మికులు హాజరు కావాలని కార్మిక నాయకుడు నాగేశ్వర్ రావు తెలిపారు.

కాంగ్రెస్లో పలువురి చేరిక



కొత్తపల్లిలో కాంగ్రెస్లో చేరిన నాయకులు

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లిలో పలువురు నియోజకవర్గం బాన్సువాడ ఇన్చార్జి బాల్రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్లో చేరారు. కోటగిరి మండలం కొత్తపల్లిలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్కు అధికారం ఇస్తే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్ దేశాయ్, మండల అధ్యక్షుడు షాహిద్, ఎంపీటీసీ కొట్టం మనోహర్, పోతంగల్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, పోతంగల్ విండో వైస్ చైర్మన్ పవన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలెక్ నాయకులు పుల్కటి సాయిలు, మన్సూర్, విఠల్ రెడ్డి, బండి సాయిలు యాదవ్, పీరయ్య, హన్మండ్లు, దత్తు, శ్రీనివాస్, శంకర్, నడిపి గంగారం, అర్జున్, నడిపి సాయిలు, రమేష్, రాము పాల్గొన్నారు.

బీఆర్ఎస్లో పలువురి చేరిక



బీఆర్ఎస్లో చేరిన నాయకులు

నందిపేట్: మండలంలోని కౌల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుఫారం గ్రామస్థులు ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్రెడ్డి ఆధ్వర్యంలో మూకుమ్మడిగా ఆదివారం బీఆర్ఎస్లో చేరారు. కార్యక్రమంలో కౌల్పూర్ సర్పంచు గబ్బర్సింగ్, నాయకులు ధన్శ్రీను, రాజశేఖర్, కొండపనేని సందీప్, తిలక్నాయుడు, షేక్షరీఫ్, నాయబ్ రసూల్, దినేష్, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం కష్టపడాలి



ఆర్మూర్లో డీకే అరుణను కలిసిన బోధన్ నేతలు

బోధన్: ఎన్నికల్లో విజయం కోసం కష్టపడాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ నియోజకవర్గ నేతలకు సూచించారు. ఆర్మూర్లోని ఎంపీ అర్వింద్ స్వగృహంలో ఆదివారం బోధన్కు చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డి మోహన్రెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చ ఏయాలన్నారు.